## క్లుప్తంగా

### వేడుకగా పోలేరమ్మ జాతర



విడవలూరు: మండలంలోని ముదివర్తిలో పోలేరమ్మ జాతరను గ్రామస్తులు మంగళవారం నిర్వహించారు. మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు భారీగా తరలివచ్చి పొంగళ్లు పొంగించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. పార్టీ నేత కొండూరు వెంకటసుబ్బారెడ్డి, పార్టీ రైతు విభాగ జిల్లా అధ్యక్షుడు పూండ్ల అచ్యుత్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, కొండూరు లక్ష్మీనారాయణరెడ్డి, ఎంపీపీ సౌందర్య, కాయల రఘు తదితరులు పాల్గొన్నారు.

### కేంద్ర భూ విజ్ఞాన శాఖ కార్యదర్శిని కలిసిన వీసీ



రవిచంద్రన్‌తో వీసీ శ్రీనివాసరావు

వెంకటాచలం: కేంద్ర భూ విజ్ఞాన శాఖ కార్యదర్శి డాక్టర్ ఎం.రవిచంద్రన్‌ను విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) వీసీ అల్లం శ్రీనివాసరావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వర్సిటీ అకడమిక్, ఇన్నోవేషన్, భూ విజ్ఞాన రంగంలో సంయుక్త పరిశోధనలపై చర్చలు జరిపారు. వీఎస్‌యూ విద్యార్థులకు పరిశోధన అవకాశాలను కల్పించేందుకు సహకారాన్ని కోరగా రవిచంద్రన్ సానుకూలంగా స్పందించారు.

### ఉపాధ్యాయురాలికి సత్కారం



విడవలూరు: నెల్లూరులోని రావూస్ కళాశాలలో జిల్లా ఇంగ్లిష్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఊటుకూరు జెడ్పీ పాఠశాల ఇంగ్లిష్ ఉపాధ్యాయురాలు పద్మజను సత్కరించారు. అంకితభావంతో పనిచేసినందుకు గానూ ఆమెను సన్మానించారు. ఆమెకు అభినందనలను పలువురు తెలియజేశారు.

### వైభవంగా శివపార్వతుల ఏకాంతసేవ



ప్రత్యేకాలంకరణలో స్వామి, అమ్మవారు

మనుబోలు: మండలంలోని మనుబోలు బీసీ కాలనీ సమీపంలో ఉన్న భగవాన్ వెంకయ్యస్వామి మందిర ఆవరణలో శివపార్వతులకు ఏకాంతసేవను మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసులు స్వామి, అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. గంధళ్ల కృష్ణయ్య – అన్నపూర్ణమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమాలను గ్రామ పెద్దలు పర్యవేక్షించారు.

### పంటను రేపటిలోపు నమోదు చేసుకోవాలి



కొడవలూరు: పంట నమోదు, ఈ – కేవైసీకి గురువారంలోపు నమోదు చేసుకోవాలని ఏఓ లక్ష్మి సూచించారు. మండలంలోని మిక్కిలింపేట, కొత్తవంగల్లులో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆమె మాట్లాడారు. పంట నమోదు కాకపోతే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించుకోవడం కుదరదన్నారు. రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య అవసరమని, వెంటనే సొంత పొలమున్న వారు రైతు సేవా కేంద్రాలను సంప్రదించి పొందాలని కోరారు. ఏఈఓ వెంకట్రావు, వీఏఏలు మౌర్య, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# చరిత్రకు సాక్ష్యం.. ప్రభగిరిపట్నం

- అలనాటి ప్రభాకరపట్నమే నేటి ఊరు
- గుప్తనిధుల కోసం చారిత్రక ఆనవాళ్లు ధ్వంసం
- ఆలనాపాలనా లేని దేవతామూర్తుల విగ్రహాలు
- పట్టించుకోని పురావస్తు శాఖ అధికారులు
- దాతల సహకారంతో దేవాలయాల జీర్ణోద్ధరణ



కామాక్షి సమేత కైలాసనాథ ఆలయం



అలనాటి ప్రాచీన శాసనం

పొదలకూరు: శతాబ్దాల నాటి చరిత్రకు సాక్ష్యం ప్రభగిరిపట్నం పురావస్తు శాఖ నిరాదరణకు గురై విలువైన ఆధారాలు అంతరించిపోయాయి. పొదలకూరు మండల కేంద్రానికి పది కి.మీ దూరంలో ప్రభగిరిపట్నం ఉంది. విజయనగర రాజుల కాలంలో సైనిక కార్యకలాపాలకు కేంద్రంగా ఇది ఉండేదని చరిత్రకారులు వెల్లడిస్తున్నారు. 101 దేవాలయాలతోపాటు 101 బావులు ఉండేవని చెబుతుంటారు. 2008లో అప్పటి ప్రభుత్వం పురావస్తు శాఖ ద్వారా నిధులను మంజూరు చేసి ఇక్కడి అభయాంజనేయస్వామి దేవస్థానాన్ని అభివృద్ధి చేయడంతోపాటు చరిత్రకు సంబంధించి ఆధారాలను సేకరించగలిగారు. తర్వాత పట్టించుకోలేదు. దీంతో ఉన్న మరికొన్ని ఆధారాలు కాలగర్భంలో కలసిపోయేలా ఉన్నాయి. ప్రాచీన చెన్నాకేశవాలయం (పెరుమళ్లేశ్వరాలయం), కామాక్షి సమేత కైలాసనాథుడు (శివాలయం), అభయాంజనేయస్వామి దేవస్థానాలున్నాయి. శివాలయం, ఆంజనేయస్వామి ఆలయాల జీర్ణోద్ధరణ చేపట్టారు.

**చరిత్ర ఏం చెబుతుందంటే..**

ఐదారు శతాబ్దాల క్రితం ప్రభాకరవర్ధనుడనే రాజు ఇక్కడ పరిపాలించాడని, నిత్యం సంగం ఆనకట్ట పెన్నా నదికు సారంగమార్గం గుండా వెళ్లి స్నానం చేసి శ్రీఅభయాంజనేయస్వామిని సేవించేవారనే కథనం ఉంది. ఇటీవల ఇక్కడికి వచ్చిన చరిత్రకారులు, అధ్యాపకులు సత్యవతి, డాక్టర్ గోవిందు సురేంద్ర శతాబ్దాల క్రితం వరదరాజు మహారాజు కుమారుడు పద్మశేఖర మహారాజు ప్రభగిరిపట్నం నిర్మించినట్టుగా వెల్లడిస్తున్నారు. దేవాలయాలను పరిశీలించి అలనాటి విజయనగర శిల్పాకళను కళ్లకు కట్టినట్టు ఉందంటున్నారు. ఆలయాల వెలుపల పడవేసిన శిల్పాల్లో సూక్ష్మరూపంలో మలచబడి రామాయణ, భారత, భాగవత ఘట్టాలను స్మరణకు తెస్తున్నట్టుగా ఉన్నాయి. విజయనగర కాలం నాటి స్థానిక రాజైన మహారాజ వెంకటపతిరాయ పేరుతో గుడులకు చేసిన దానధర్మాలు, ఆదాయ మార్గాలను ఒక శాసనంలో పేర్కొన్నట్టుగా గుర్తించారు. గ్రామాన్ని ప్రభాకర పట్టణంగా పిలిచేవారని చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు. వీరభద్రస్వామి, చెన్నకేశవ స్వామి, వైష్ణవ అల్వార్లు వినాయకుడు వంటి విగ్రహాలు అలనాపాలన లేకుండా శిథిలావస్థకు చేరుకున్నాయి.

**పట్టించుకోకుండా..**

నిధుల లేమి, ప్రభుత్వ ప్రోత్సాహం కరువైన పురావస్తు శాఖ చరిత్రకు సాక్ష్యాలుగా ఉన్న ప్రభగిరిపటన్నంను పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పురావస్తు ఇంజినీరింగ్ శాఖ ద్వారా 2008లో ప్రభగిరిపట్నం వైభవాన్ని చాటేందుకు రూ.1.20 కోట్లు మంజూరు చేశారు. అంచనాలు రూపొందించి తొలివిడత నిధులతో అప్పట్లో ఆంజనేయస్వామి దేవస్థానం చుట్టూ ఫెన్సింగ్, జీర్ణోద్ధరణ పనులు చేశారు. అదే సమయంలో శిథిలమైన శివాలయాన్ని స్తపతి ద్వారా తొలగించి కొత్తగా శివాలయం పనులను ప్రారంభించారు. తర్వాత నిధుల మంజూరు మందగించడంతో పనులు నిలచిపోయాయి. శివాలయాన్ని హైదరాబాద్‌కు చెందిన మధుసూదన్‌రెడ్డి సొంత నిధులను వెచ్చించి అభివృద్ధి చేశారు. జీర్ణోద్ధరణ పనులతోపాటు మండపాలు, గోశాల, భక్తులు విడిది చేసేందుకు భవనం తదితరాలు చేపట్టారు.

**గుప్తనిధుల కోసం..**

ప్రభగిరిపట్నం చుట్టుపక్కల ప్రాంతాలు, ప్రాచీన దేవాలయాల్లో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిగాయి. ఒకటి, రెండు పర్యాయాలు గ్రామస్తులు పోలీసులకు సైతం సమాచారం అందించగా అపరిచితులు పారిపోయిన సందర్భాలున్నాయి. గుప్తనిధుల మాఫియా ఎంతో ప్రాచీనమైన దేవతామూర్తుల విగ్రహాలు కొన్నింటిని ధ్వంసం చేసినట్టు గ్రామస్తులు చెబుతున్నారు. మూడు దశాబ్దాల క్రితం ఈ ప్రాంతం అడవిని తలపించేది. దాతల చొరవ, వైఎస్సార్ ప్రభుత్వం వల్ల కొంతమేర అభివృద్ధి చెంది భక్తుల రాకపోకలు పెరిగింది.



దేవాలయ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న చరిత్రకారుడు సురేంద్ర



చెట్టు కింద ఉంచిన దేవతామూర్తుల విగ్రహాలు

### శిల్ప సంపదను కాపాడుకోవాలి



ప్రభగిరిపట్నం శిల్ప సంపదను కాపాడుకోవాలి. ఆలయాల నైపుణ్యం, వాస్తురీతిని ఈ ప్రాంత గొప్పతనంగా భావించి భావి తరాలకు అందించాలి. ఇందుకు గ్రామస్తుల సహకారం అధికంగా ఉండాలి.

– గోవిందు సురేంద్ర, చరిత్రకారుడు, అధ్యాపకుడు, నెల్లూరు

### వీఎస్‌యూలో జాబ్‌మేళా

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో మంగళవారం జాబ్‌మేళా జరిగింది. 69 మంది విద్యార్థులు హాజరు కాగా 33 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ కో–ఆర్డినేటర్ డాక్టర్ జె.విజేత, పి.జనార్దన్ పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

ముత్తుకూరు: మండలంలోని ముత్తుకూరులో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2025 – 26 సంవత్సరానికి 5వ తరగతి, జూనియర్ ఇంటర్‌లో ప్రవేశానికి ఈనెల 6వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ సుజాత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశపరీక్ష ఏప్రిల్ 6వ తేదీ ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జరుగుతుందని వెల్లడించారు.

### డిగ్రీ పరీక్షలకు నలుగురు విద్యార్థుల హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో మంగళవారం డిగ్రీ ఒకటో సెమిస్టర్, నాలుగో సెమిస్టర్ మెగా సప్లిమెంటరీ పరీక్షలు జరిగాయి. వీటికి నలుగురు విద్యార్థులు హాజరయ్యారని పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ సీహెచ్ వెంకట్రాయులు తెలిపారు.

### నీటి ఎద్దడి తలెత్తకూడదు



మాట్లాడుతున్న విద్యారమ

ఇందుకూరుపేట: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని జెడ్పీ సీఈఓ విద్యారమ కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయానికి మంగళవారం వచ్చిన ఆమె మాట్లాడారు. జిల్లాలోని 31 సీపీడబ్ల్యూ స్కీములను పరిశీలించామని చెప్పారు. ఎంపీడీఓ నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత శిఖరాలను అధిరోహించాలి




సత్కారం అందుకున్న మహిళా ఉపాధ్యాయులు

విడవలూరు: స్థానిక పీఆర్‌ఆర్ – వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం ప్రిన్సిపల్ సుజాత మాట్లాడారు. ఆదర్శ మహిళలను స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కాంక్షించారు. అనంతరం మహిళా అధ్యాపకులను సత్కరించారు. వైస్ ప్రిన్సిపల్ మధు, ఉమెన్ ఎంపవర్‌మెంట్ కన్వీనర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

## తప్పుడు ప్రచారం చేయడం సరికాదు



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

వెంకటాచలం: 'గిరిజనుల భూములను వైఎస్సార్‌సీపీ నాయకులు అమ్మేశారని టీడీపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఇది సరికాదు' అని వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకుడు ఆరుగుంట ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సర్వేపల్లి గ్రామంలో స్థానిక నాయకులతో కలిసి మంగళవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సర్వేపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు 6.21 ఎకరాల భూమిని ఒక్కో ఎకరా రూ.33 లక్షల లెక్కన అమ్మేసుకుని సొమ్ము చేసుకున్నారని గిరిజనుల చేత సోమవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయించారు. దీనిపై ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ తమపై టీడీపీ నాయకులు చేసే ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. అధికారంలో ఉండేది కూటమి ప్రభుత్వమే కావడంతో విచారణ జరిపి వాస్తవాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. అమాయకులైన గిరిజనుల చేత తప్పుడు ఫిర్యాదులు చేయడం మంచిపద్ధతి కాదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులపై బురదచల్లే కుట్రలో భాగంగానే ఇలాంటి నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. 40 ఏళ్లకు పైగా సర్వేపల్లిలో రాజకీయం చేస్తున్నామని, పేదలకు చేతనైన సాయం చేశామే తప్ప, భూములు అమ్ముకోవాల్సిన స్థితిలో లేమని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సర్వేపల్లి సమీపంలోని అన్నీ కంపెనీల వద్దకు టీడీపీ నాయకులు వెళ్లి దౌర్జన్యాలు, బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు చిట్టమూరు శివకుమార్‌రెడ్డి, నాయకులు ఎల్లసిరి జగదీష్‌రెడ్డి, అశోక్, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

మనుబోలు: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య కోరారు. మనుబోలు సచివాలయం – 1 వద్ద కేంద్రాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. మనుబోలుతోపాటు పిడూరు, వీరంపల్లి, అక్కంపేట గ్రామాల్లో కూడా కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఏ గ్రేడ్‌కు రూ.19,700, బీ గ్రేడ్‌కు రూ.19,500 చొప్పున మద్దతు ధర కల్పిస్తున్ననట్లు తెలిపారు. ధాన్యాన్ని బాగా ఆరబెట్టుకుని 17 శాతం కన్నా ఎక్కువగా తేమ శాతం మించకుండా ధాన్యం తీసుకురావాలన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి షేక్ జహీర్, వీఆర్వో నాగార్జునరెడ్డి తదితరులున్నారు.

## యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం



ప్రీ స్కూల్ పిల్లలతో యోగా సాధన



గండవరంలో..

కొడవలూరు: ప్రీ స్కూల్ స్థాయి నుంచే యోగ సాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండొచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల పేర్కొన్నారు. కొడవలూరులోని మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులు, ప్రీ స్కూల్ పిల్లలతో యోగాను మంగళవారం సాధన చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రీ స్కూల్ దశ నుంచే యోగా ఆవశ్యకతను తెలియజేయాలనే ఉద్దేశంతో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్త రమీజా పాల్గొన్నారు.

➾ చిరుధాన్యాల ఆవశ్యకతపై గండవరంలోని ప్రీ స్కూల్ పిల్లలు, తల్లులకు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగభూషణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు మమత, ఉమా తదితరులు పాల్గొన్నారు.

### బాబా మందిర వార్షికోత్సవం రేపు

పొదలకూరు: పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిర 19వ వార్షికోత్సవాన్ని ఈనెల 6వ తేదీన నిర్వహిస్తామని మందిర సేవా సమితి సొసైటీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఆరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ కార్యక్రమాలు జరుగుతాయని, అన్నదానం చేస్తామని వెల్లడించారు.

### బాల్య వివాహాలు నేరం



చిన్నారులతో సూపర్‌వైజర్ రమణమ్మ

మనుబోలు: బాల్య వివాహాలు చేయడం నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని పిడూరు అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహాలు, విద్య ఆవశ్యకతపై మంగళవారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలను బాగా చదివించాలని సూచించారు. చిన్నారులకు మంచి పౌష్టిక విలువలున్న ఆహారాన్ని అందించాలన్నారు. అనంతరం చిన్నారులతో యోగా చేయించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నళిని, అంగన్‌వాడీ విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

### శ్రీహరికోట సుధాకర్ నియామకం

విడవలూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల మత్స్యకార అధ్యక్షుడిగా రామలింగాపురం గ్రామానికి చెందిన శ్రీహరికోట సుధాకర్‌ను నియమించారు. ఈ మేరకు ఉత్తర్వులు మంగళవారం విడుదలయ్యాయి.

### ఇరువర్గాల ఘర్షణ

ఇందుకూరుపేట: స్థల వివాదమై మండలంలోని చట్టివారికండ్రిగలో ఇరువర్గాల మధ్య వివాదం మంగళవారం జరిగింది. దీంతో తల్లీకొడుకు కలిసి మరోవర్గానికి చెందిన ముగ్గురిపై కత్తితో దాడిచేసి గాయపర్చారు. పోలీసుల వివరాల మేరకు.. చట్టివారి కండ్రగకు చెందిన శ్రీనివాసులు.. వెంకటేశ్వర్లు వరుసకు సోదరులు. వీరి మధ్య భూ వివాదం నెలకొంది. ఈ క్రమంలో భూమికి కొలతసేందుకు గానూ సర్వేయర్ మంగళవారం రాగా, వెంకటేశ్వర్లు అడ్డుకున్నారు. దీంతో సర్వేయర్ వెళ్లిపోయారు. దీంతో అగ్రహానికి గురైన శ్రీనివాసులు తన తల్లి కోటేశ్వరమ్మతో కలిసి వెంకటేశ్వర్లును కత్తితో పొడిచారు. ఆయన తీవ్రంగా, తల్లి శేషమ్మ, సోదరి మాధవి స్వల్పంగా గాయపడ్డారు. హత్యాయత్నం కేసును ఎస్సై నాగార్జునరెడ్డి నమోదు చేశారు. దర్యాప్తు చేస్తున్నారు.

## కార్మికుల భద్రతకు అధిక ప్రాధాన్యం




మాట్లాడుతున్న సునీల్‌కుమార్ గుప్తా



మాట్లాడుతున్న సీఈఓ జగదీష్ పటేల్

ముత్తుకూరు: కార్మికుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని నేలటూరులోని ఎస్ఈఐఎల్ ఎనర్జీ లిమిటెడ్ సంస్థ ఓఅండ్‌ఎం విభాగాధిపతి సునీల్‌కుమార్ గుప్తా అన్నారు. ప్రాజెక్టులో మంగళవారం ఏర్పాటు చేసిన 54వ భద్రతా దినోత్సవాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా 'వికసిత భారత్‌కు భద్రత, శ్రేయస్సు చాలా కీలకం' అనే అంశంపై ప్రసంగించారు. ప్రతి ఉద్యోగి, కార్మికుడి శ్రేయస్సుకు కట్టుబడి ఉన్నామన్నారు.

**కృష్ణపట్నం పోర్టులో..**

నిరంతరం భద్రత ప్రమాణాలు పాటిస్తూ సమర్థవంతంగా పనిచేయాలని అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈఓ జగదీష్ పటేల్ అన్నారు. భద్రతా దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విభాగంలో భద్రత స్పష్టంగా కనిపించాలన్నారు. ప్రమాదాల నివారణకు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలన్నారు. మార్చి 10వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు.

## మర్యాదపూర్వకంగా..





విడవలూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగాల మండలాధ్యక్షులుగా ఎంపికైన పలువురు.. మాజీ మంత్రి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. నిమ్మల శివకుమార్ (బీసీ సెల్), గుబ్బల రాధయ్య (వాణిజ్య విభాగం), దాసరి కరుణాకర్ (వైఎస్సార్‌టీయూసీ) కలిసి పూలమొక్కను అందజేశారు. పార్టీ రైతు విభాగ జిల్లా అధ్యక్షుడు పూండ్ల అచ్యుత్‌రెడ్డి, మండల కన్వీనర్ కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, బూత్ కమిటీ కన్వీనర్ లక్ష్మీనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి నరేష్, రామతీర్థం దేవస్థాన మాజీ చైర్మన్ నాటూరు చంద్రయ్య, నెల్లూరు చెంచురత్నం, నాటూరు భాస్కర్, దాసరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కోవూరు: మాజీ మంత్రి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో ఇందుకూరుపేట మండలానికి చెందిన పలువురు నేతలు కలిశారు. పార్టీ ఇంటలెక్చువల్ ఫోరం విభాగ నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమితులైన కొండ్లపూడి శ్రీనివాసులురెడ్డి.. ప్రసన్నకు కృతజ్ఞతలను తెలియజేశారు. పశుగుణాభివృద్ధి రాష్ట్ర చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, వెంకిరెడ్డి, ట్రేడ్ యూనియన్ నియోజకవర్గ అధ్యక్షుడు బిరదవోలు రూప్‌కుమార్‌రెడ్డి, రఘురామయ్య పాల్గొన్నారు.

### టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు

పొదలకూరు: చేజర్ల మండలం మాముడూరు నుంచి తెల్లరాయి (ముడిసరుకు)ను సైదాపురానికి టిప్పర్లో నిర్లక్ష్యంగా తీసుకెళ్తూ ఆటో, మోటార్‌బైక్‌పై రాళ్లు పడేందుకు కారణమైన డ్రైవర్‌పై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్సై ఎస్‌కే హనీఫ్ కథనం మేరకు.. తెల్లరాయి లోడ్ చేసుకున్న హెవీ టిప్పర్ మాముడూరు నుంచి పొదలకూరు మీదుగా సైదాపురానికి బయలుదేరింది. డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల డేగపూడి వద్ద ఆటో, బైక్‌పై రాళ్లు జారిపడ్డాయి. దీంతో వాహనాలు దెబ్బతినడంతో బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. టిప్పర్‌ను సీజ్ చేసి, డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.